
డోన్: వెంకటాపురం గ్రామంలో కొబ్బరి తోట


ఎర్రగుంట్ల వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు,


జలమయమైన కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం


డోన్ మార్కెట్‌యార్డు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపునీరు


అవుకు-మెట్టుపల్లె రహదారిలో నీటి ఉధృతి

భారీ వర్షం.. రైతుకు తీరని నష్టం

- దెబ్బతిన్న మిరప, మొక్కజొన్న పంటలు
- కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ జలమయం
- రాకపోకలకు తీవ్ర అంతరాయం
- అవుకు మండలంలో 45.4 మి.మీ వర్షం
- వాగులకు కొనసాగుతున్న వరద


కోవెలకుంట్ల: అమడాలలో నీట మునిగిన మిరప పంట


డోన్: దొరపల్లె గ్రామంలో నీట మునిగిన కొర్రపంట

కోవెలకుంట్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లోని ఆయా మండలాల్లో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. సబ్ డివిజన్‌లోని అవుకు మండలంలో అత్యధికంగా 45.4 మి.మీ., కోవెలకుంట్ల మండలంలో 27 మి.మీ, కొలిమిగుండ్ల మండలంలో 35 మి.మీ, దొర్నిపాడు మండలంలో 17.8 మి.మీ, ఉయ్యాలవాడ మండలంలో 1.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు ఆయా మండలాల వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. భారీ వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. మిరప పంట నీట మునిగి రైతులకు నష్టం వాటిల్లింది. మొక్కజొన్న కోత దశలో ఉండగా భారీ వర్షంతో నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో వాగులు, వంకలకు వరద ఉధృతి పోటెత్తింది.

ప్రయాణికులకు తప్పని కష్టాలు

భారీ వర్షం కారణంగా కోవెలకుంట్ల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం జలమయమైంది. ప్రధాన రహదారి కంటే బస్టాండ్ లోతట్టు ప్రాంతం కావడంతో బస్టాండ్ ఇన్‌గేట్, అవుట్‌గేట్, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు చేరింది. వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లేందుకు అవస్థలు పడ్డారు. వర్షపునీటిలో దిగి రాకపోకలు సాగించాల్సి రావడంతో బురద కష్టాలు తప్పలేదు. సంబంధిత అధికారులు బస్టాండ్ ఆవరణలో వర్షపునీరు నిల్వ చేరకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొలిమిగుండ్లలో ఆశాజనకంగా వర్షపాతం

కొలిమిగుండ్ల: అల్పపీడన ప్రభావంతో మండలంలో రెండు రోజుల నుంచి ఆశాజనకంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం 35.మి.మీ వర్షపాతం నమోదు కాగా రెండు రోజుల క్రితం 50.5 మి.మీ వర్షం కురిసింది. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలకు వర్షం జీవం పోసింది. ఈ నెలలో 20 రోజుల తర్వాత వరుణుడు పలకరించాడు. సెప్టెంబర్‌లో సాధారణ వర్షపాతం 126.6 మి.మీ కాగా ఇప్పటి వరకు 96.2 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు రోజుల పాటు వర్షాలు కురిసినా చెరువులకు పెద్దగా వరదనీరు చేరలేదు. కొలిమిగుండ్ల సమీపంలోని సద్దలవెంగన్న చెరువుకు మాత్రం స్వల్పంగా నీరు చేరింది. తిమ్మనాయినపేట, హనుమంతుగుండం, అబ్దులాపురం చెరువులు వెలవెలబోతున్నాయి. భారీ వర్షాలు కురిసి భూగర్భ జలాలు పెరగాలని రైతులు వరుణ దేవుని కోసం పూజలు చేస్తున్నారు.

నీట మునిగిన పంటలు

డోన్: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షంతో పంటలు నీట మునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వంకలు, వాగులు పొంగి పొర్లాయి. డోన్ మండలం ఎర్రగుంట్ల గ్రామం వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చిన్నమల్కాపురం, ఎర్రగుంట్ల మీదుగా డోన్‌కు రావాల్సిన వాహనాలను కమలాపురం, కన్నపకుంట, ధర్మవరం మీదుగా దారి మళ్లించారు. దీంతో 3గంటల పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతయారం కలిగింది. వెంకటనాయునిపల్లె వద్ద వంక ఉధృతంగా ప్రవహించడంతో రెండు గంటలపాటు రాకపోకలు బంద్ అయ్యాయి. 48 మి.మీ వర్షం కురవడంతో దొరపల్లె, ఉడుములపాడు, వలసల గ్రామాల్లో కంది, కొర్ర పంటలు నీట మునిగాయి. పట్టణంలో హౌసింగ్, వ్యవసాయ కార్యాలయాలు జలమయమయ్యాయి. పలుచోట్ల చెట్లకొమ్మలు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

అవుకులో భారీ వర్షం

మండలంలో 45.4 మి.మీ వర్షపాతం నమోదైందని వ్యవసాయ అధికారులు మంగళవారం తెలిపారు. కొద్ది రోజులుగా మండలంలో వేసవి కాలాన్ని తలపిస్తూ ఉక్కపోత, ఎండ తీవ్రత ఎక్కువగా కనిపించింది. సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షంతో కొంత ఉపశమనం దొరికింది. మండల కేంద్రంలో రెండున్నర గంటల పాటు భారీ వర్షం కురిసింది. పలు కుంటలు, వాగులకు నీరు చేరింది. చివరి దశకు వచ్చిన కొన్ని పంటలకు మినహా మిగతా అన్ని పంటలకు ఈ వర్షం అనుకూలిస్తుందని అధికారులు తెలిపారు.

కుంటను తలపిస్తున్న రహదారి

అవుకు: మండలంలో సోమవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. అవుకు- మెట్టుపల్లె రహదారిలో భారీగా వర్షపు నీరు చేరి కుంటను తలపిస్తోంది. ఈ మార్గంలోనే ఆదర్శ పాఠశాల, కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఉండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


సంజామల: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

సంజామల: మండలంలోని పేరుసోముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్, సెపక్ తక్ర పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సీతారావమ్మ తెలిపారు. నంద్యాలలో జరిగిన జిల్లా స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలో దివ్య, చంద్రిక, దస్తగిరమ్మ, కర్నూలులో జరిగిన సెపక్ తక్ర క్రీడలో జ్యోతి ప్రియాబాయి వర్షిత ఎంపికయ్యారని చెప్పారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాప్‌ను హెచ్‌ఎం అభినందించారు.

కోవెలకుంట్ల విద్యార్థిని ప్రతిభ

కోవెలకుంట్ల: స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల విద్యార్థిని రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం గీతా తెలిపారు. రెండు రోజుల క్రితం నంద్యాల మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థిని శాన్విత సత్తా చాటిందన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై నట్లు పేర్కొన్నారు. మంగళవారం హెచ్‌ఎంతోపాటు కరస్పాండెంట్ జాన్‌మేరి, పీడీలు హర్ష, ఓబులేసు శాన్వితను అభినందించారు.

ఉపాధ్యాయుడికి సన్మానం


ప్రతాప్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ, తదితరులు

బనగానపల్లె: స్థానిక తెలుగుపేటలోని ఎంపీపీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న ప్రతాప్ ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం బనగానపల్లె ఎస్సీ కాంప్లెక్స్ సముదాయంలో ఎస్‌ఐ దుగ్గిరెడ్డి, ఎమ్మార్పీఎస్, ప్రజా సంఘాల నాయకులు ఆయన్ను సన్మానించారు. నాయకులు పెద్దమునెయ్య మాదిగ, ఎర్రన్న, నారాయణ, సుబ్బారెడ్డి, రంగస్వామి, రాము, ఓబులేసు మద్దిలేటి, నాగేశ్వరరావు, రామకృష్ణ, నాగన్న పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

డోన్ టౌన్: సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ప్రజా రవాణాధికారి రజియా సుల్తానా పిలుపునిచ్చారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో, బస్టాండ్ ఆవరణలో మేనేజర్ శశిభూషణ్, ఆర్టీసీ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. యూనియన్ నాయకులు సీతారాంరెడ్డి, వెంకటరమణారెడ్డి, ,మౌలాలి, సీనియర్ ట్రాఫిక్ సూపర్‌వైజర్ నైజర్, గ్యారేజ్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

బేతంచెర్ల సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ

బేతంచెర్ల: మండల సబ్ రిజిస్ట్రార్‌గా వనిత లక్ష్మి మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇంతకు ముందు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న అబ్దుల్ కరీమ్ ఆత్మకూరుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల జాయింట్ సబ్ రిజిస్ట్రార్-2 గా విధులు నిర్వహిస్తున్న వనిత లక్ష్మి బేతంచెర్లకు వచ్చారు. ఆమెకు అబ్దుల్ కరీమ్ బాధ్యతలు అప్పగించారు.

టీడీపీ నాయకుడు సహా 8 మందిపై కేసు

సంజామల: వ్యక్తిపై దాడి చేసిన టీడీపీ నాయకుడు సహా 8 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. సంజామలకు చెందిన శివ నాగేంద్ర ప్రసాద్‌కు అదే ప్రాంతానికి చెందిన టీడీపీ నేత అల్లి హుసేన్ తండ్రి జాఫర్ హుసేన్ మధ్య కొంతకాలంగా స్థల వివాదం నడుస్తోంది. మంగళవారం శివ నగేంద్ర ప్రసాద్ బస్టాండ్ వద్ద ఉన్న సమయంలో అల్లిహుసేన్ అక్కడి వచ్చి గొడవ పెట్టుకున్నాడు. తన అనుచరులు సునీల్ కుమార్, నాగరాజు, సురేష్, మల్లి, రాముడు, సురేంద్ర, శ్రీనివాసులుతో కలిసి దాడి చేసి గాయపరిచారు. బాధితుడి శివ నాగేంద్ర ప్రసాద్ ఫిర్యాదు మేరకు టీడీపీ నేత అల్లిహుసేన్ సహా ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కోడిపందెం ఆడుతున్న ఏడుగురి అరెస్ట్

ప్యాపిలి: పట్టణ శివారు ప్రాంతంలో కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిని ప్యాపిలి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. స్థానిక కలచట్ల రోడ్డు వద్ద కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఈ మేరకు దాడులు నిర్వహించారు. ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 4,530 నగదు, 4 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

డోన్ టౌన్: క్రీడలతో శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత చేకూరుతుందని మున్సిపల్ వైస్ చైర్మన్ కొట్రికె హరికిషన్, హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి, కోఆర్డినేటర్ సుధాకర్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోట్ల స్టేడియంలో నియోజకవర్గ స్థాయి క్రీడలను వారు ప్రారంభించారు. కమలాపురం సర్పంచ్ అర్జున్‌రెడ్డి, పీఆర్ డీఈ గంగాధర్, ప్రిన్సిపాల్ వేణు గోపాల్ పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన


కోవెలకుంట్లలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

కోవెలకుంట్ల: డోన్ న్యాయవాది, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మీశెట్టి ప్రసాద్‌పై పోలీసులు అక్రమ కేసు బనాయించడంతో కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయవాదులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. కోర్టు గేటు ఎదుట ధర్నా నిర్వహించి న్యాయవాదికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ.. న్యాయవాదిపై అక్రమ కేసు పెట్టిన డోన్ పట్టణ సీఐ ఇంతియాజ్ బాషాపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. కోవెలకుంట్ల న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణాకు వినతిపత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు. న్యాయవాదులు వాసగిరి సాయికృష్ణమూర్తి, బాలమురళీకృష్ణ, తిరుపతయ్య, జీఎల్ నరసింహుడు, తిరుపాలు, విష్ణుమనోహర్‌రెడ్డి, సుధాకర్, రమేష్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పలువురు వీఆర్వోల బదిలీ

కోవెలకుంట్ల: మండలంలోని గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న పలువురు వీఆర్వోలను బదిలీ చేసినట్లు తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కోవెలకుంట్ల పట్టణంలోని రెండు, మూడు, ఐదు గ్రామ సచివాలయాల వీఆర్వోలు పుల్లయ్య ఇదే మండలంలోని రేవనూరు, చెన్నయ్య సంజామల మండలంలోని కానాల, షఫియా కర్నూలుకు బదిలీ అయ్యారన్నారు. కోవెలకుంట్ల 1వ సచివాలయానికి ఉయ్యాలవాడలో పనిచేస్తున్న నరసింహారెడ్డి, రెండో సచివాలయానికి గోస్పాడు మండలం కృష్ణాపురం వీఆర్వో ఆదినారాయణరెడ్డి, 3వ సచివాలయానికి ఉయ్యాలవాడ మండలంలోని కొండుపల్లె సచివాలయ వీఆర్వో ఓబులేసును నియమించారని వెల్లడించారు. కోవెలకుంట్ల మండలం భీమునిపాడు వీఆర్వో బాలమద్దిలేటి కలుగొట్లకు, అక్కడ పనిచేస్తున్న నాగమద్దిలేటిని భీమునిపాడుకు, సౌదరదిన్నె వీఆర్వోగా సంజామల మండలం పేరుసోములలో పనిచేస్తున్న మురళీమోహన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలిపారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు


పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ అబ్దుల్ కలాం

కొలిమిగుండ్ల: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈఓ అబ్దుల్ కలాం అన్నారు. మంగళవారం కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలను ఆయన ప్రారంభించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అండర్-14, అండర్-17 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. ఆటలు ఆడటం వల్ల శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి క్రీడల్లో రాణించి దేశవాలీ పోటీలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ గల క్రీడాకారులు ఉన్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం హుసేనయ్య, పీఈటీలు గంగాదేవి, గిరి, శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రసాయనిక మందుల వినియోగం తగ్గించాలి


బనగానపల్లె: మీరాపురంలో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్న అధికారులు


బనగానపల్లె రూరల్: పంటల సాగులో రసాయనిక మందుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడాలని మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని యాగంటిపల్లె, మీరాపురం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రసాయనిక మందుల వినియోగం వల్ల భూమి ఆరోగ్యం దెబ్బతిని పంట దిగుబడి తగ్గుతుందని తెలిపారు. యాగంటిపల్లె కృషి విజ్ఞాన కేంద్రం భూసార శాస్త్రవేత్త రమణయ్య భూసార పరీక్షలు, రసాయనిక మందుల వినియోగంపై వివరించారు. పశువైద్యుడు బ్రహ్మానందరెడ్డి పశువుల్లో వచ్చే వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు.

- **బేతంచెర్ల:** రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పంటల సాగుతో పాటు పశుపోషణ చేపట్టాలని డోన్ వ్యవసాయశాఖ ఏడీఏ అశోక్ వర్ధన్ రెడ్డి, శాస్త్రవేత్త వెంకటరమణ అన్నారు. ఆర్‌ఎస్ రంగాపురం, అంబాపురం గ్రామాల్లో కంది, పత్తి, ఆముదం, కొర్ర పంటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యలను తెలియజేశారు.
- **అవుకు:** రైతులు అధిక దిగుబడులు సాధించాలంటే వ్యవసాయ అధికారుల సూచనలు తప్పక పాటించాలని ఏఓ అబ్దుల్ హక్ అన్నారు. చనుగొండ్ల, సంగపట్నం గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు.

ప్రకృతి వ్యవసాయం ఉత్తమం

కోవెలకుంట్ల: రసాయన ఎరువులు, క్రిమి సంహారక మందులకు స్వస్తి చెప్పి రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని మండల వ్యవసాయాధికారి నిరంజన్ సూచించారు. సౌదరదిన్నె, అమడాల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయం అన్ని విధాలా లాభదాయకమన్నారు. వ్యవసాయ అధికారుల సూచనలు, సలహాలు పాటించి ఆయా పంటల్లో అధిక దిగుబడులు సాధించాలని పేర్కొన్నారు. ఏటా భూసార పరీక్షలు చేయించుకుని భూమిలోని పోషకాలు గుర్తించి అందుకనుగుణంగా పంటలు సాగు చేయాలని సూచించారు. అనంతరం క్షేత్రస్థాయిలో వివిధ పంటలను పరిశీలించారు. పశువైద్యాధికారి కృష్ణకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ అవసరం


సేకరించిన నగదును అందిస్తున్న విద్యార్థులు

డోన్ టౌన్: విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహ కలిగి ఉండాలని డోన్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అక్బర్‌పాషా అన్నారు. పట్టణంలోని శ్రీవాసవి స్కూల్ విద్యార్థులు విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు విరాళాల రూపంలో సేకరించిన రూ.15,554 నగదును మంగళవారం ఆయనకు అందజేశారు. స్కూల్ ప్రిన్స్‌పాల్ రమేష్, చంద్రశేఖర్ విద్యార్థులను అభినందించారు.

మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

డోన్ టౌన్: స్వయం ఉపాధిపై ఆరు రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న కొచ్చెర్వు పాదుపు మహిళలకు మంగళవారం ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ డైరెక్టర్ పుష్పక్, డోన్ కెనరా బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్ పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు సెర్డ్ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు.

ఎంపీడీఓ బదిలీ

కోవెలకుంట్ల: స్థానిక ఎంపీడీఓ సయ్యదున్నీసాను బదిలీ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీఓల సాధారణ బదిలీల్లో భాగంగా ఆమెను వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేసి ఆ స్థానంలో అదే జిల్లాలో పనిచేస్తున్న వరప్రసాదరావును నియమించారు. అలాగే ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న రాధిక బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో కర్నూలు జిల్లా ఆలూరు ఈఓపీఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్న ప్రకాష్‌నాయుడును కోవెలకుంట్ల ఈఓపీఆర్డీగా నియమించారు.

కొలిమిగుండ్ల ఎంపీడీఓగా వెంగన్న

కొలిమిగుండ్ల: కొలిమిగుండ్ల ఎంపీడీఓగా వెంగన్న బేతంచెర్ల నుంచి బదిలీపై వచ్చారు. గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన సాయికృష్ణ మూడు నెలల పాటు సెలవులో ఉండడంతో ఆయన స్థానంలో ఏఓ ప్రసాదరెడ్డికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బదిలీల్లో భాగంగా వెంగన్నను కొలిమిగుండ్లకు నియమించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో అక్టోబర్ 2వ తేదీ తర్వాత ఎంపీడీఓలు విధుల్లో చేరే అవకాశాలు ఉన్నాయి.

సంజామల ఎంపీడీఓగా సాల్మన్

సంజామల: స్థానిక ఎంపీడీఓగా సాల్మన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇది వరకు మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా ఉన్న విజయ్‌కుమార్‌రెడ్డి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వర్తించారు. సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లాలో పనిచేస్తున్న సాల్మన్‌ను సంజామల ఎంపీడీఓగా నియమించారు.

సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి

కొలిమిగుండ్ల: పంటల సాగులో మెలకువలు పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చని వ్యవసాయాధికారిణి జ్యోతి అన్నారు. మంగళవారం కమ్మవారిపల్లె, పెద్దవెంతుర్ల గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులకు మట్టి నమూనాల ఫలితాలకు చెందిన కార్డులను పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న కార్యక్రమాల గురించి అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో శనగ పంటలో తీసుకోవాల్సిన సస్యరక్షణపై రైతులకు వివరించారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి రమేష్, ఏఈఓ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్‌గా శివకుమార్

కోవెలకుంట్ల: స్థానిక సబ్ రిజిస్ట్రార్‌గా కర్నూలు జిల్లా గూడూరు సబ్ రిజిస్ట్రార్ శివకుమార్‌ను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న సర్వేశ్వరనాథ్ ఈ ఏడాది జూన్‌లో పదవీ విరమణ పొందారు. ఆ స్థానంలో కర్నూలుకు చెందిన హాజీమియాను ఇన్‌చార్జ్‌గా నియమించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కోవెలకుంట్ల రెగ్యులర్ రిజిస్ట్రార్‌గా శివకుమార్‌ను నియమించారు.

వేలం పాట వాయిదా

బనగానపల్లె: మండలంలోని నందవరం చౌడేశ్వరిదేవి ఆలయం వద్ద కూల్‌డ్రింక్స్ విక్రయాలకు సంబంధించిన వేలంపాటను అక్టోబర్ 3వ తేదీకి వాయిదా వేసినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ తెలిపారు. ఈ నెల 23న వేలం పాట జరగాల్సి ఉండగా.. డిపాజిట్ చెల్లించేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

ఉసేన్‌స్వామి దర్గాకు రూ.22.63 లక్షల ఆదాయం

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో వెలసిన ఉసేన్‌స్వామి దర్గాకు హుండీ కానుకల ద్వారా రూ.22.63 లక్షల ఆదాయం వచ్చింది. మంగళవారం 16 నెలలకు సంబంధించిన హుండీ కానుకలను లెక్కించారు. దర్గా కమిటీ, గ్రామపెద్దలు, రేవనూరు పోలీసుల ఆధ్వర్యంలో లెక్కింపు సాగింది. స్వామివారికి ఫతేహాలు నిర్వహించేందుకు వచ్చిన భక్తులు దర్గాకు రూ. 22.63 లక్షలను సమర్పించారు. ఎస్‌ఐ భూపాలుడు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ప్రయోజనాలు


మాట్లాడుతున్న సెర్ప్ పీడీ శ్రీధర్ రెడ్డి

ప్యాపిలి: ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో పాటు అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని సెర్ప్ పీడీ శ్రీధర్ రెడ్డి అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మంగళవారం వెలుగు సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రసాయనిక ఎరువులు విరివిగా వాడడం ద్వారా భూసారం తగ్గిపోతుందని తెలిపారు. సేంద్రియ ఎరువులతోనే మంచి దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. సేంద్రియ ఎరువులు, వేప కషాయాన్ని స్వయంగా తయారు చేసుకోవచ్చన్నారు. తద్వారా పెట్టుబడి వ్యయం తగ్గిపోతుందని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్‌ఎంపీ లక్ష్మయ్య, సెర్ప్ ఏపీఎం సురేశ్, ఏపీఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలి


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

ప్యాపిలి: విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం అన్నారు. స్థానిక కళాశాలలో మంగళవారం జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు సామాజిక స్పృహను కలిగి ఉండాలన్నారు. తోటి వారు పడుతున్న ఇబ్బందులను గమనించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ నవీనపాటి, అధ్యాపకులు రామకృష్ణయ్య, సత్యబాబు, నవీన్, ఓబులేసు, ముస్తాక్, వెంకటరమణ, మద్దిలేటి, శంకరయ్య, వెంకి తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో విజయం సొంతం


పలుకూరులో క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈఓ స్వరూప

బనగానపల్లె రూరల్: విద్యార్థులు క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని.. పట్టుదలతో విజయం సాధించవచ్చని ఎంఈఓ స్వరూప అన్నారు. మంగళవారం మండలంలోని పలుకూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి క్రీడా ఎంపిక పోటీలను ఆమె ప్రారంభించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థులు ఓటమిని సైతం అంగీకరించి విజయానికి మరింత కృషి చేయాలని సూచించారు. చదువుతో పాటు తమకు ఆసక్తి ఉన్న క్రీడాల్లోనూ రాణించాలన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 450 మంది విద్యార్థులు పాల్గొన్నారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు నియోజకవర్గ స్థాయిలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో పాల్గొనే అకాశం ఉంటుందని వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తెలిపారు. హెచ్‌ఎం గౌరిశంకర్, మండల స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డ్యాన్స్ పోటీల్లో బేతంచెర్ల బృందం విజయం

బేతంచెర్ల: విశాఖపట్నంలో సోమవారం జరిగిన రాష్ట్ర స్థాయి డ్యాన్స్ బేబీ డాన్స్ పోటీల్లో బేతంచెర్లకు చెందిన డీజే మధు డ్యాన్స్ బృందం విజయం సాధించింది. పోటీల్లో మొత్తం 17 జట్లు పాల్గొనగా ప్రథమ స్థానంలో నిలిచి రూ. 50 వేల నగదు బహుమతి సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా పట్టణ వాసులు డీజే మధు బృందాన్ని అభినందించారు.



ప్రథమ స్థానం కైవసం చేసుకున్న డీజే మధు బృందం


పచ్చని చెట్లు.. ప్రగతికి మెట్లు


విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బనగానపల్లె: ప్రతి విద్యార్థి మొక్కలను నాటి సంరక్షించాలని జేకేఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానంద ఆచారి అన్నారు. మండలంలోని గొవిందిన్నె ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు మొక్కల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం యాస్మిన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న జలపాతం

బనగానపల్లె రూరల్: మండలంలోని పసుపల గ్రామ సమీపంలో ఉన్న గుండం మల్లికార్జునస్వామి ఆలయం వద్ద ఉన్న జలపాతం నుంచి జాలువారుతున్న నీరు భక్తులను ఆకట్టుకుంటోంది. సోమవారం రాత్రి డోన్ మండలంలోని చిన్న మల్కాపురం, పెద్దమల్కాపురం కమలాపురం తదితర గ్రామాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా జలపాతానికి వరద నీరు చేరుతోంది. ఈ నీరు సమీపంలో ఉన్న పసుపల చెరువుకు చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జలపాతం తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు.


గుండం మల్లికార్జునస్వామి ఆలయం వద్ద జలపాతం నుంచి జాలువారుతున్న నీరు